సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



నాన్నమాటతో ఐఏ'ఎస్' అయ్యాడు!
కలెక్టర్ అయితే సేవ చేయవచ్చన్న నాన్న మాటను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించాడు శ్రీకాంత్. - 8లో



'సదరం'పై స్పందించారు!
చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహణ సమస్యలపై అధికారులు స్పందించారు. సమస్యలు పరిష్కరించారు. - 8లో



హెల్మెట్ విధిగా పెట్టుకోండి
ద్విచక్రవాహనచోదకులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

పలువురికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ

పుంగనూరు: రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పట్టణంలోని పలువురి వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు వెళ్లి, వారిని కలిసి, పరామర్శించారు. పట్టణంలోని నక్కబండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖాదర్ బాషా ఇంటికెళ్లి ఆయన్ని కలిశారు. అలాగే అస్లాం మురాది, మైనార్టీ పట్టణ నేత బావాజాన్ ఇళ్లకు వెళ్లి వారిని కలిశారు. అలాగే షఫీవుల్లా ఇంటికి వెళ్లి ఆయన కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు అమ్ము‌తోపాటు కౌన్సిలర్లు ఖిజర్ ఖాన్, రేష్మా, భారతి ఉన్నారు.

అభ్యంతరాల అనంతరం సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఇదివరకే పలుసార్లు విడుదల చేసిన సీనియారిటీ జాబితాల అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జాబితా మరోసారి విడుదల చేసినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీ జనరల్ సీనియారిటీ జాబితాను మెరిట్ ఆధారంగా మేనేజ్‌మెంట్ వారీగా రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటికే రెండుసార్లు సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఆ జాబితాల్లో వచ్చిన అభ్యంతరాలను సవరించిన ఎస్జీటీ జనరల్ సీనియారిటీ జాబితాను చిత్తూరు డీఈఓ.కామ్ (www.chittoordeo.com) వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వెల్లడించారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు పనులు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరులో ఎంఎస్‌ఆర్ సర్కిల్ నుంచి పలమనేరు రోడ్డు, ఇరువారం మీదుగా బైపాస్ వరకు 5 కిలోమీటర్లు లేయర్ కు రూ.2.50 కోట్లు, పలమనేరు–గుడియాత్తం రోడ్డు 3 కిలోమీటర్లు రూ.1.80 కోట్లు, బైరెడ్డిపల్లె–పుంగనూరు రోడ్డులో 6 కిలోమీటర్లు రూ.4.50 కోట్లతో లేయర్ వేయనున్నమన్నారు. త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం జెడ్పీ హైస్కూల్‌లో 92 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 77 మంది ఫెయిల్ అయ్యారు. అలాగే గంగాధరనెల్లూరు మండలం ముకలత్తూరు జెడ్పీ హైస్కూల్ లో 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఒకే విద్యార్థి ఉత్తీర్ణత సాధించగా మిగిలిన 24 మంది పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఇలాంటి పాఠశాలలు చిత్తూరు జిల్లాలో చాలానే ఉన్నాయి.

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు జెడ్పీ హైస్కూల్‌లో 61 మంది విద్యార్థులకుగాను 23 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 38 మంది ఫెయిల్ అయ్యారు. కోట మండలం కోట జెడ్పీ హైస్కూల్‌లో 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 35 మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఇలాంటి పాఠశాలలు తిరుపతి జిల్లాలో చాలానే ఉన్నాయి.



వేల సంఖ్యల్లో ఫెయిల్

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విద్యార్థులు వేల సంఖ్యలో ఫెయిల్ అయ్యారు. చిత్తూరు జిల్లాలో 6,850 మంది ఫెయిల్ కాగా అందులో బాలురు 2,882 మంది అధికంగా పరీక్షల్లో తప్పారు. మిగిలిన 2,700 మంది బాలికలు ఫెయిల్ అయ్యారు. అలాగే తిరుపతి జిల్లాలో 5,381 మంది ఫెయిల్ కాగా అందులో బాలురు 3,259 మంది అధికంగా పరీక్షల్లో తప్పారు. మిగిలిన 2,122 మంది బాలికలు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు జిల్లాల్లో వేల సంఖ్యల్లో విద్యార్థులు పరీక్షల్లో తప్పడంపై కూటమి సర్కారు అనాలోచిత ప్రణాళికలే కారణమని విద్యావేత్తలు విమర్శలు గుప్పిస్తున్నారు.

తిరుపతి, చిత్తూరు జిల్లాల పది ఫలితాల సమాచారం

పరీక్షలకు హాజరైన బాలురు	24,786
ఉత్తీర్ణులైన బాలురు	17,377
పరీక్షలకు హాజరైన బాలికలు	22,689
ఉత్తీర్ణులైన బాలికలు	17,867
ఫెయిల్ అయిన బాలురు	7,409
ఫెయిల్ అయిన బాలికలు	4,822
మొత్తం ఫెయిల్ అయిన విద్యార్థులు	12,231



పదింతల వెనకడుగు

కూటమి సర్కారు నిర్లక్ష్యం.. అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళిక లేమి.. విద్యాశాఖపై కొరవడిన పర్యవేక్షణ..ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థికి అందని బోధన.. అభ్యసన సామగ్రి.. వెరసి పది పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపింది. తండ్రి రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. కుమారుడు సాక్షాత్తు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించినా వారి నిర్లక్ష్యం.. ఉదాసీనత.. అసంబద్ధ నిర్ణయాలతో సొంత జిల్లాల్లోనే పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో పదింతలు వెనుకపడ్డారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పేద పిల్లలు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

బెడిసికొట్టిన కూటమి సర్కారు ప్రణాళికలు
- సర్కారు పాఠశాలలపై పర్యవేక్షణ శూన్యం
- ఉపాధ్యాయుల కొరతతో పలు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులు
- సీఎం సొంత జిల్లాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభావం చూపని పది ఫలితాలు

గత ప్రభుత్వ పాలనలో ఇలా..	ఈ ఏడాది కూటమి పాలనలో..
విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల కొరత సర్దుబాటుచేసి బోధన	విద్యాసంవత్సరం మధ్యలో టీచర్లను సర్దుబాటు చేయడం
సకాలంలో సిలబస్ పూర్తి	జనవరి, ఫిబ్రవరి నెలల్లోనూ సిలబస్ పూర్తి చేయని పరిస్థితి
ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక మెటీరీయల్ ముద్రించి సరఫరా	ప్రస్తుతం అలాంటి మెటీరియల్ జాడే లేదు
ప్రణాళిక ప్రకారం రివిజన్ తరగతుల నిర్వహణ	ఫిబ్రవరి పూర్తి అయినా రివిజన్ తరగతులు లేమి
ఉత్తమ ఫలితాలకోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం, ప్రణాళిక అమలు	ప్రత్యేక సమావేశం లేదు, పటిష్ట ప్రణాళిక సైతం అమలు కాలేదు
కీలకమైన 77రోజుల కార్యాచరణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ	కీలకమైన కార్యాచరణ లేనే లేదు. ప్రత్యేక తరగతులు ఆలస్యంగా నిర్వహణ
చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో గత ఏడాది 3,578 మంది విద్యార్థులు ఫెయిల్	ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 12,231 మంది విద్యార్థులు ఫెయిల్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వేల సంఖ్యల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పది విద్యార్థులు ఫెయిల్ కావడం విస్మయానికి గురిచేస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తొలి మెట్టులాంటి పదో తరగతిపై కూటమి సర్కారు అలసత్వ వైఖరి చూపడంతోనే ఈ చేదు ఫలితాలు చోటు చేసుకున్నట్లు విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు. చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి 20,796 మంది, తిరుపతి జిల్లా నుంచి 26,679 మంది మొత్తం 47,475 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో చిత్తూరు జిల్లాలో 13,456, తిరుపతి జిల్లాలో 21,298 మొత్తం 34,754 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. సీఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాల్లో పది పరీక్షల్లో ఫలితాలు బోల్తా కొట్టడం పై విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు.

కుప్పంలోనూ అదే వెనుకబాటు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనూ పది ఫలితాలు వెనుకబడ్డాయి. కుప్పం మండలంలో 1,833 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 703 మంది ఫెయిల్ అయ్యారు. ఇందులో బాలురు అధికంగా 449, బాలికలు 254 మంది పది పరీక్షల్లో తప్పారు. సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం మండలంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన మండలాల్లో పరీక్షల్లో తప్పిన విద్యార్థుల సంఖ్య ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులకు ప్రభుత్వాలు ఇచ్చే బహుమతి ఏదైనా ఉందంటే అది చదువు ఒక్కటే అని గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ విషయాన్ని గాలికి వదిలేసింది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో టీచర్ల కొరతతోనే ఎక్కువ మంది విద్యార్థులు పది పరీక్షల్లో ఫెయిల్ కావాల్సిన దుస్థితి ఏర్పడింది.

అలసత్వం తగదు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులపై కూటమి సర్కారు ప్రదర్శిస్తున్న అలసత్వ వైఖరి తగదు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి చాలా కీలకం. అలాంటి పదో తరగతి పరీక్షలపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయం. ప్రభుత్వ అలసత్వ వైఖరితోనే సీఎం సొంత జిల్లాలైన చిత్తూరు, తిరుపతి జిల్లాలల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. – ప్రవీణ్, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్, చిత్తూరు జిల్లా

అనాలోచిన నిర్ణయాలే కారణం



కూటమి ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంది. విద్యాసంవత్సరం మధ్యలో సర్దుబాటు కార్యక్రమం ఎవరైనా నిర్వహిస్తారా? అనాలోచిత నిర్ణయాలతో వేల సంఖ్యలో విద్యార్థులు పరీక్షల్లో తప్పారు. ఇందుకు గల కారణాలు విద్యాశాఖ అధికారులు నోరు మెదపకపోవడం బాధాకరం. సీఎం సొంత జిల్లాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్ కావడం విస్మయానికి గురిచేస్తోంది. – శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి, తిరుపతి జిల్లా

మాకెందుకీ పరీక్ష



పీవీకేఎన్ పరీక్షాకేంద్రం వద్ద అధిక సంఖ్యలో హాజరైన డిగ్రీ విద్యార్థులు

వర్సిటీలు పరీక్షల నిర్వహణలో రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యం.. పరీక్షల నిర్వహణలో ప్రణాళిక లోపం.. వసతుల కల్పనలో ఉదాసీనం.. వెరసి విద్యార్థుల పాలిటశాపంగా మారుతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎస్వీయూ పరీక్షల నిర్వహణలో సఫలీకృతం కాలేపోతోంది. ఫలితంగా విద్యార్థులు మాకెందుకీ పరీక్షల శిక్ష అని పరేషాన్ అవుతున్నారు.

ఇలాగేనా పరీక్షల నిర్వహణ..!
- పరిమితికి మించి విద్యార్థులు కేటాయింపు
- మొదటి రోజు డిగ్రీ పరీక్షల్లో తొక్కిసలాట
- పీవీకేఎన్‌లో పరీక్షల నిర్వహణపై అలసత్వం
- పరిమితికి మించి కేటాయింపు
- ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులుండాలి...అలాగే విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ప్రశాంత వాతావరణం ఉండాలి. అయితే జిల్లా కేంద్రంలో పేరొందిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో గందరగోళం నెలకొంది. పరీక్షల నిర్వహణపై అవగాహన ఉన్న అధికారులే అలసత్వం వహించడంతో క్షేత్రస్థాయిలో సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

సెమిస్టర్ పరీక్షల్లో పరిమితికి మించి విద్యార్థులు

ఎస్వీ యూనివర్సిటీ షెడ్యూల్ మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. నిబంధనల మేరకు విద్యార్థుల కేటాయించాల్సిన యూనివర్సిటీ అధికారులు అధిక సంఖ్యలో ఇష్టానుసారం విద్యార్థులను కేటాయించారు. వందల సంఖ్యలో విద్యార్థులను పీవీకేఎస్ కేంద్రంలో కేటాయించడంతో మొదటి రోజు తొక్కిసలాట తలెత్తింది. అలాగే విద్యార్థులకు తగిన మౌళిక వసతులు కల్పించలేకపోయారు.



పీవీకేఎన్ కేంద్రంలో కుర్చీలపై కూర్చొని పరీక్షలు రాస్తున్న డిగ్రీ విద్యార్థులు

కేంద్రం వద్ద తొక్కిసలాట

మొదటి రోజు వివిధ కళాశాలల నుంచి పీవీకేఎన్ పరీక్ష కేంద్రం వద్దకు డిగ్రీ విద్యార్థులు పరీక్షల రాసేందుకు చేరుకున్నారు. 1200 మంది విద్యార్థులు ఒకేసారి పరీక్ష కేంద్రం వద్దకు రావడంతో గందరగోళం నెలకొంది. పరీక్ష కేంద్రంలోకి వెళ్లే సమయంలో తొక్కిసలాట చోటు చేసుకోవడంతో పలువురు విద్యార్థులు కింద పడిపోయారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు వెళ్లేందుకే గంట సమయం పట్టింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు పూటల నిర్వహించిన పరీక్షల్లో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ పరీక్షల నిర్వహణలో కళాశాల ప్రిన్సిపల్ అలసత్వం సరికాదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పెదవివిరిచారు.

గంటల కొద్దీ కుర్చీల్లో..

డెస్కులపై కూర్చుని పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు కుర్చీలపై కూర్చుని పరీక్షలు రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. పీవీకేఎన్ పరీక్ష కేంద్రంలో 1200 మందికి పైగా విద్యార్థులను పరీక్షలకు కేటాయించడం విమర్శలకు తావిచ్చింది. అధిక సంఖ్యలో విద్యార్థులను కేటాయించడంతో విద్యార్థులకు సరిపడ డెస్కులు లేకపోవడంతో కుర్చీలను ఏర్పాటు చేశారు. ఆ కుర్చీల్లో గంటల కొద్ది కూర్చుని విద్యార్థులు పరీక్షలు రాశారు.

ఎనీటైం కిక్కే!



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు కే నారాయణస్వామి మండిపడ్డారు. తిరుపతి పద్మావతీపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు తాగునీటి కన్నా మద్యమే అధికంగా లభిస్తోందన్నారు. కూటమి పాలనలో బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు వెలిశాయని, బార్లను తలపించేలా మద్యం షాపులకు పక్కనే పర్మిట్ రూములు ఉన్నాయన్నారు. దానికితోడు ఏ వీధి చూసినా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. మద్యం, గంజాయి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చిన ఘనత చంద్రబాబుది కాదా? అని ప్రశ్నించారు. ఎన్టీ రామారావు మద్యపాన నిషేధాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. అయితే ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన ద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ప్రస్తుత చంద్రబాబు పాలనలో కూటమి ఎమ్మెల్యేలు, వారి అనుచరులకే మద్యం షాపులను కట్టబెట్టి విక్రయిస్తున్నారన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రజల రక్తాన్ని పీల్చుకుతాగుతున్నారని తెలిపారు. గతంలో కూడా చంద్రబాబు పాలనలో విపరీతంగా మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని, దానిపై సీఐడీ కూడా కేసు నమోదు చేసిందని గుర్తుచేశారు. అయితే ఆ కేసు ఏమైందని, దానిపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

జగనన్న పాలనలోనే మద్యం నియంత్రణ

రాష్ట్రంలో జగనన్న పాలన వచ్చాక దశల వారీగా మద్యపానాన్ని నిషేధిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని మాజీ డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్న 4,380 మద్యం షాపుల సంఖ్యను 2,934కు తగ్గించారని, 43 వేల బెల్టుషాపులను, 4,380 పర్మిట్ రూములను రద్దు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. జగనన్న పాలనలో మద్యం కుంభకోణం జరిగిందంటూ చంద్రబాబుతోపాటు ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వ అరాచకాలను గమనిస్తున్నారని, అందుకు తగిన బుద్ధి చెబుతారన్నారు.


డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం



ఆన్‌లైన్ డీఎస్సీ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభించిందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ మునీంద్రయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆన్‌లైన్ డీఎస్సీ శిక్షణ ప్రారంభ కార్యక్రమాన్ని గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలకు సహాయం చేసేందుకు ఆన్‌లైన్ డీఎస్సీ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని వెల్లడించారు.

పకడ్బందీగా ప్రవేశ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రవేశాల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం నిర్వహించే ప్రవేశ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలకు జిల్లా కేంద్రంలో విజయం డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కేశవరెడ్డి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, క్యాంఫర్డ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 756 మంది విద్యార్థుల పాఠశాల అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదే పరీక్ష కేంద్రాలతో పాటు గిరింపేట మున్సిపల్ పాఠశాలలో జూనియర్ కళాశాలల అడ్మిషన్లకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలకు 1,082 మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్, రూట్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు, జిల్లా కో ఆర్డినేటర్‌లను నియమించారన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, జిల్లా గురుకుల కళాశాలల కోఆర్డినేటర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్ హుస్సేన్ సస్పెన్షన్


సస్పెండ్ అయిన హుస్సేన్

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సదుం ఇన్‌చార్జ్ తహసీల్దార్ హుస్సేన్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు సదుం వీఆర్వో మహబూబ్ బాషాను సైతం సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మండలానికి నూతన తహసీల్దార్ నియమించే వరకు ప్రస్తుతం పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెల్మెట్ విధిగా పెట్టుకోండి

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ సూచించారు. రోడ్డు భద్రతా అవగాహనలో భాగంగా గురువారం చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద హెల్మెట్ ర్యాలీ, రోడ్డు భద్రతపై రూపొందించిన పాటను ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల స్కూటరిస్టులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారని, హెల్మెట్ వాడకపోవడమే ఇందుకు కారణమన్నారు. గత ఐదేళ్లలో 350 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే, 170 మంది వరకు ద్విచక్ర వాహన చోదకులే ఉండటం ఆలోచించాల్సిన విషయమన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఇక పాటను రూపొందించడంలో శ్రద్ధ చూపించిన ట్రాఫిక్ సీఐ నిత్యబాబును ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ భాష, ఈస్ట్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కార్వేటినగరం: గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కార్వేటినగరం త్యాగరాజ పిళ్లై వీధికి చెందిన చిన్నిరెడ్డి కుమారుడు గోపాల్(52) కొన్నాళ్లుగా గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం ఆ బాధ ఎక్కువ కావడంతో తాళలేక అతనే బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు అతనిని ప్రైవేటు వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి, తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అతన్ని రుయాకు తరలించారు. ప్రస్తుతం అతను రుయాలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నాన్నమాటతో ఐఏఎస్ అయ్యాడు!

ఉన్నత ఉద్యోగం.. రూ.కోటి ప్యాకేజీ.. జీవిత భాగస్వామికీ మంచి కొలువు.. మంచి సంసారం ..సాఫీగా సాగే జీవనం.. అయినా ఏదో తెలియని వెలితి.. అసంతృప్తి.. ఏదో సాధించాలన్న తపన.. ఎలాగైనా కలెక్టర్ కావాలన్న పదే పదే గుర్తుకు వచ్చే చిన్ననాటి నాన్న మాట.. అతడిని సివిల్స్ వైపు నడిపించింది. అదే లక్ష్యం.. పట్టుదల..కృషి.. స్వీయశిక్షణ.. ప్రణాళిక.. మొక్కవోని ఆత్మస్థైర్యం.. వెరసి సివిల్ ర్యాంకర్‌గా నిలిచారు బైరెడ్డిపల్లె వాసి రంపా శ్రీకాంత్.


కుటుంబసభ్యులతో శ్రీకాంత్

కోచింగ్‌తోనే ఐఏఎస్ ఛాన్స్ భావన పొరబాటు

- ఆన్‌లైన్‌లో మెటీరియల్‌తో స్వయంగా చదివా
- డీఎంఎంగా మంచి జీతం ఉన్నా అసంతృప్తి
- చిన్నప్పుడు తండ్రి మాటే జీవిత బాటగా..
- సివిల్ సర్వీసెస్‌లో 904 ర్యాంకర్ శ్రీకాంత్

పలమనేరు: లక్ష్యం కోసం కష్టపడి ప్రయాణిస్తేనే అది తప్పకుండా దక్కుతుందంటున్నారు ఇటీవల సివిల్ సర్వీసెస్‌లో 904 ర్యాంకు సాధించిన బైరెడ్డిపల్లి వాసి రంపం శ్రీకాంత్. ఉత్తమ ఉద్యోగం ఉన్నా జీవితంలో ఏదో తెలియని లోటు.. తాను సివిల్ సర్వెంట్ కావాలన్న తపనతో సివిల్స్ కోసం రోజుకు ఎనిమిది గంటల కష్టపడి చదువుతూ, కోచింగ్ తీసుకుంటేనే పరీక్షలు ఉత్తీర్ణత సాధించగలమన్న ఆలోచనను పక్కన పెట్టి, స్వీయశిక్షణతోనే తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.

రూ.కోటి పాకేజీ కంటే తండ్రి మాటే వేదంగా..

'నాన్న నువ్వు బాగా చదివి ఎలాగైనే కలెక్టర్ కావాలి.. అప్పుడే మనలాంటి పేదలకు సాయంగా ఉండొచ్చు.' అని తండ్రి నాగరాజు చిన్నప్పుడు శ్రీకాంత్‌కు చెప్పిన మాట ఎప్పుడూ గుర్తు పెట్టుకున్నారు. ప్రఖ్యాత కంపెనీలో భారీ ప్యాకేజీతో కొలువున్నా సంతృప్తి చెందలేదు. సివిల్స్ కొట్టాలనే తపన శ్రీకాంత్‌ను వేధిస్తూనే ఉండేది. దీంతో 2021 నుంచి ఆఫీసు పని ముగిశాక స్వీయ శిక్షణతో నాలుగు సార్లు సివిల్స్ రాసి, ఈ సారి ర్యాంకర్‌గా నిలిచారు.

ఇదీ కుటుంబ నేపథ్యం

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి రంపం శ్రీకాంత్ స్వగ్రామం. తండ్రి నాగరాజు గంగవరం పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తల్లి రేణుక గృహిణి. శ్రీకాంత్ బైరెడ్డిపల్లెలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆపై 6,7 తరగతులు అక్కడే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. 8 నుంచి 10వ తరగతి వరకు పలమనేరులోని లిటిల్ ఏంజెల్స్, ఇంటర్ శ్రీ చైతన్యలో చదివారు. ఆపై హైదరాబాద్‌లోని సీబీఐటీ బీటెక్ కంప్యూటర్ సైన్సు, తరువాత బెంగళూరులోని ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేశారు. తొలుత అమెజాన్‌లో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం గూగుల్‌లో రూ.కోటి ప్యాకేజీతో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు స్వీయశిక్షణ పొందుతూ స్వయంగా చదివారు. తిరుపతికి చెందిన అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జోత్స్న కుమార్తె శ్రావ్యను ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. శ్రావ్య సైతం బెంగళూరులోని టార్గెట్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తోంది. వీరికి మూడేళ్ల పాప ఉంది.

కష్టపడితే ఎప్పటికైనా విజయం

క్యాట్ రాసిన అనుభవంతో సివిల్స్‌కు స్వయంగా చదవడం మొదలు పెట్టా. ఆన్‌లైన్‌లో మెటీరియల్, డైలీ న్యూస్ పేపర్లు చదవాను. ఆప్షనల్‌గా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ పెట్టుకున్నా. ఇంటర్వ్యూలో సైతం ఎక్కువగా అంతర్జాతీయ వ్యవహారాలైన ఉక్రెయిన్ వార్, చైనా క్యాపిటలిస్టిజం, టెర్రరిజం తదితరాలపైనే ఎక్కువ ప్రశ్నలడిగారు. చివరగా మనం చిన్నపాటి గ్రామంలో ఉన్నాం కదా ఐఏఎస్ కావాలంటే ఢిల్లీ కెళ్లి కోచింగ్ తీసుకోవాలనే మాట పక్కన పెట్టి ధైర్యంగా ముందుకెళ్లాలి.

– రంపం శ్రీకాంత్, బైరెడ్డిపల్లి

15 నుంచి వేరుశనగ విత్తన పంపిణీకి ప్రణాళికలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఖరీఫ్ సీజన్ దృష్ట్యా మే 15వ తేదీ నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముందస్తుగా విత్తనాలు సరఫరా చేస్తే సాగు విస్తీర్ణం పెంచవచ్చని భావిస్తున్నారు. ఏటా విస్తీర్ణం తగ్గిపోతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసున్నారు. దీనికి తోడు అదునుకు వర్షాలు కురిస్తేనే సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాకు అవసరమైన విత్తనాలకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపారు. శ్రీకాళహస్తీలోని విత్తన కేంద్రం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అవసరమైన విత్తనాలు పరిమాణం, రకం వివరాలు సేకరించింది. దీంతో అధికారులు వేరుశనగలో కే6 రకానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. తర్వాత టీసీజీఎస్1694 రకం ఎంపిక చేశారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

22 మంది విద్యార్థుల డిబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గురువారం నుంచి ప్రారంభమైన డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల్లో తొలిరోజు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 22 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన సమాచారం మేరకు మదనపల్లి జోన్ పరిధిలో 16 మంది, చిత్తూరు జోన్ పరిధిలో ఆరుగురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడగా అధికారులు వారిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

దళితులపై ఎందుకీ వివక్ష


మాట్లాడుతున్న మంగుంట వాసులు

శ్రీరంగరాజపురం : దళితులైన తమపై టీడీపీ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ వివక్ష చూపుతున్నారని మంగుంట దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, టీడీపీ నేతల దళితులపై వివక్ష చూపుతున్న నేపథ్యంలో గురువారం వారు విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని పేద ప్రజల వలసల నివారణకు స్థానికంగానే పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం అమలు చేసి, 100 రోజులు పని కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ఉపాధి కూలీలపై నిర్లక్ష్యం, వివక్ష చూపుతుందని ఆరోపించారు. తమకు పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించక పోగా.. మీకు పని కావాలంటే టీడీపీ నాయకులు జీవన్‌బాబురెడ్డి, చంద్రరెడ్డి చెబితేనే కల్పిస్తానని, లేకుంటే లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయుకులు జీవన్‌బాబురెడ్డి, చంద్రరెడ్డిని అడిగితే మా ఇంటి, పొలం వద్దకు పనిచేయడానికి వస్తేనే మీకు పని కల్పిస్తామని, లేకుంటే లేదని చెబుతున్నారని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఓ లలితకుమారికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

డీపీఓకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డీపీఓ సుధాకర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: గత ఆర్థిక సంవత్సరం పంచాయతీ పన్నుల వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి స్థానం వచ్చింది. ఇందుకుగాను జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం డీపీఓ సుధాకర్‌రావు విజయవాడలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గుడిపాల మండలం చీలాపల్లె పంచాయతీలో జలజీవన్ మిషన్, ఇతర పథకాల్లో ప్రతిభ చూపినందుకు గుడిపాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, సర్పంచ్ అరుణ్‌కుమార్ అవార్డులు అందుకున్నారు.

కానిస్టేబుల్ లక్ష్మికి పోలీసు లాంఛనాలతో వీడ్కోలు


పోలీసు లాంఛనాలతో వీడ్కోలు పలుకుతున్న పోలీసు సిబ్బంది

చౌడేపల్లె: కుటుంబ సభ్యుల మనస్పర్థల కారణంగా బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన కానిస్టేబుల్ లక్ష్మికి పోలీసు లాంఛనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం ఎస్ఐ నాగేశ్వరరావు కుటుంబసభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, గుడిపల్లి, సోమల, చౌడేపల్లె, పుంగనూరుతో పాటు పలువురు పోలీసు సిబ్బంది కానిస్టేబుల్ లక్ష్మి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. రూ: లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మి మృతితో గోసలకురప్పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి అరిఫ్ తెలిపారు. ఒక కుటుంబానికి 100 జీవాల వరకు బీమా చేసుకోవచ్చన్నారు. పది పశువులకు బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ రాయితీ పోను మేలు జాతి పశువుకు రూ.288, నాటు జాతి పశువురూ.114 ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే గొర్రెలు, మేకలు, పందులకు సంవత్సర కాలనికి రూ.27, రెండేళ్లకు రూ.40, మూడేళ్లకు రూ.56 చొప్పున్న ప్రీమియంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగంచేసుకోవాలని, ప్రీమియం చెల్లింపునకు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో హత్యలు జరుగుతున్నాయి

– టీడీపీ నాయకుడు షణ్ముగం


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు షణ్ముగం

చిత్తూరు రూరల్ : ప్రభుత్వాస్పత్రిలో హత్యలు జరుగుతున్నాయని, తన కుమార్తె శ్రీదుర్గ మృతికి ముమ్మాటికి ఆస్పత్రిలోని జూనియర్ డాక్టర్లే కారణమని బీసీ నాయకుడు, టీడీపీ సీనియర్ నాయకుడు పి షణ్ముగం ఆరోపించారు. గురువారం చిత్తూరు నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన కుమార్తె మృతికి చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని వైద్యులే ప్రధాన కారణమన్నారు. నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతోనే చనిపోయిందని కన్నీంటి పర్యంతమయ్యారు. తలలో గాయపడిన విషయాన్ని తెలుసుకోకుండా ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపడంతోనే ఆమె మృతి చెందిందని గోడు వెలబోసుకున్నారు. తన బిడ్డకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం తక్షణ న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ ద్వారా సీఎం పేషీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

సీఎంసీ ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా


గుడిపాల: సీఎంసీ ఆస్పత్రిని సందర్శిస్తున్న జిల్లా ఎస్పీ

గుడిపాల: చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆరా తీశారు. గురువారం సీఎంసీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. రోగులకు వైద్యం అందిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమెర్జెన్సీ, ఎక్స్‌రే, ఓపీ కేంద్రాలను సందర్శించారు.

పది పాసైన విద్యార్థులకు సువర్ణావకాశం

- నేషనల్ వర్సిటీలో ఇంటర్ చదివే భాగ్యం
- ఇంటర్మీడియెట్ (ప్రాక్‌శాస్త్రి) కోర్సులకు ఆహ్వానం పలుకుతున్న ఎన్ఎస్‌యూ
- వచ్చే నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం


ఎన్ఎస్‌యూ భవనం

తిరుపతి సిటీ: జిల్లా విద్యార్థులకు నేషనల్ యూనివర్సిటీలో ఇంటర్మీడియెట్ చదివే అవకాశాన్ని తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ కల్పిస్తోంది. పదోతరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోర్సులో (పాక్‌శాస్త్రీ) చేరేందుకు అవకాశం కల్పిస్తూ వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇందులో ఇంగ్లిషు, హిందీ, సంస్కృతం, తెలుగు మాధ్యమాలు ఉంటాయన్నారు. ఇంటర్మీడియెట్ కోర్సుల్లో కంప్యూటర్, గణితం, హిస్టరీ, వ్యాకరణం, సాహిత్యం, జ్యోతిష్యం, ఫిలాసఫీ, యోగా వంటి సబ్జెక్టుల్లో బోధన ఉంటుందని పేర్కొన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా జాతీయ సంస్కృత వర్సిటీలో పాక్‌శాస్త్రీ కోర్సులలో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్ వసతి కల్పించనున్నట్టు తెలిపారు.

వచ్చేనెల 3 నుంచి దరఖాస్తులు

జాతీయ సంస్కృత వర్సిటీలో ఇంటర్మీడియెట్ కోర్సులు చేరదలుకున్న విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీ నుంచి వర్సిటీ వెబ్‌సైట్ www.nrktu.ac.inలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులకు కోసం వర్సిటీలో అకడమిక్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ పరీక్షల ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జాతీయ సంస్కృత వర్సిటీ ఆహ్వానం పలుకుతోంది. నేషనల్ యూనివర్సిటీలో ఇంటర్మీడియెట్ కోర్సు పూర్తి చేసే అవకాశం వర్సిటీ కల్పిస్తోంది. పాక్‌శాస్త్రీ (ఇంటర్మీడియెట్) కోర్సుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సైతం అందనున్నాయి.

–ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, ఎన్ఎస్‌యూ

సదరం స్పందించారు!

సాక్షి ఎఫెక్ట్..


బోసిపోయిన వికలాంగుల పరీక్ష కేంద్రం


అధికారులు ఏర్పాటు చేసిన తాగునీటి క్యాన్

చిత్తూరు రూరల్: సదరం సమస్యలపై జిల్లా అధికారులు స్పందించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహణపై 'సదరం గందరగోళం' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆ శాఖ అధికారులు స్పందించి ఎక్కడెక్కడ ఏఏ సమస్యలు ఉన్నాయన్న విషయం పరిశీలించారు. సదరన్ పత్రాల పరిశీలన కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేశారు. కూర్చుకోవడానికి కుర్చీలు వేశారు. దగ్గరుండి క్యూ పాటించేలా చేశారు. టోకన్ల జారీని ఉదయానికే పూర్తి చేశారు. సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. దీంతో మధ్యాహ్నానికే సదరం పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. బుధవారం మధ్యాహ్నం అయితే ఓపీ విభాగం– స్కానింగ్ విభాగం మధ్య దివ్యాంగులు, వారి సహాయకులతో రద్దీగా కనిపించింది. అరుపులు, కేకలతో దద్దరిల్లింది. అలాగే అత్యవసర విభాగం వద్ద ఉన్న వికలాంగుల పరీక్ష కేంద్రాని దివ్యాంగులు గుమ్మికూడడంతో గందరగోళ పరిస్థితి కనిపించింది. సాక్షి కథనంతో స్పందించిన అధికారులు దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా చూశారు. మధ్యాహ్నానికే పరీక్షలు ముగించుకునేలా చేశారు. ఇరుకు గదిలో జరుగుతున్న మానసిక పింఛన్‌దారుల పరీక్ష కేంద్రాన్ని మొదటి అంతస్తుకు మార్పు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబంపై దాడి


చికిత్స పొందుతున్న శ్రావణ్‌కుమార్

బంగారుపాళెం: మండలంలోని ఎద్దులవారిపల్లె దళితవాడలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబంపై టీడీపీ సానుభూతిపరులు దాడి చేశారు. గ్రామంలో పంచాయతీ తాగునీరు ఒకరోజు ఓ వైపు, మరో రోజు ఓ వైపు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం తాగునీటి కొళాయికి సంబంధించిన గేట్‌వాల్‌ను టీడీపీ కార్యకర్త గోవిందస్వామి కుమారుడు రంజిత్‌కుమార్, మరో పక్కకు తిప్పాడు. దాంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రావణ్‌కుమార్ గేట్‌వాల్ ఎందుకు తిప్పావని రంజిత్‌కుమార్‌ను ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని దుర్భాషలాడుకున్నారు. నీటి కొళ్లాయి విషయంపై గురువారం ఉదయం మళ్లీ గోవిందస్వామి కుటుంబ సభ్యులు, శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో గోవిందస్వామి, అతని భార్య నాగరాజమ్మ, అతని కుమారుడు రంజిత్‌కుమార్, బంధువు శివయ్య, చిలకమ్మ కలసి శ్రావణ్‌కుమార్, అతని భార్య స్వాతి, బంధువు సరితపై రాళ్లతో దాడి చేశారు. దీంతో శ్రావణ్‌కుమార్, స్వాతి, సరిత గాయపడ్డారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ట్రాఫిక్ నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రజలు రహదారి భద్రతా నియమాలు పాటించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 25 బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామన్నారు. ఈ బ్లాక్‌స్పాట్‌లలో 2024వ సంవత్సరంలో 249 లైట్ వెయిట్ వాహనాల ప్రమాదాలు, 209 ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ ప్రమాదాల్లో 510 మంది గాయపడగా, 228 మంది మృతి చెందారన్నారు. అందులో అత్యధికంగా ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించిన వారే 128 మంది మృతి చెందారని తెలిపారు. 2025 వ సంవత్సరం మార్చి నెల వరకు 53 లైట్ వెయిట్, 63 ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదాల్లో 153 మంది గాయపడగా 51 మంది మృతి చెందారన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించక పోవడం,హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, అతి వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారన్నారు.

ఇంటర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

– బాధ్యతలు స్వీకరించిన నూతన డీఐఈఓ శ్రీనివాసులు


బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన డీఐఈఓ (జిల్లా ఇంటర్మీడియట్ అధికారి) శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన పీసీఆర్ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపునకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తామని తెలిపారు. మెరుగైన ఫలితాల సాధనకు పటిష్ట ప్రణాళికను అమలు చేస్తామన్నారు. అనంతరం ఆయనకు మాజీ డీఐఈఓ సయ్యద్ మౌలా, ప్రిన్సిపల్ శరత్‌చంద్ర, అబ్దుల్ మజీద్, ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రైలు కిందపడి ఇద్దరు యువకుల దుర్మరణం


భువనచంద్ర(ఫైల్)


రైలు నుంచి జారిపడి మృతి చెందిన బిహార్ యువకుడు

కుప్పంరూరల్: వేర్వేరు చోట్ల జరిగిన రెండు రైలు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు గురువారం మృతి చెందారు. కుప్పం మండలం క్రిష్ణదాసనపల్లి గ్రామానికి చెందిన యువకుడు బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డగా, బీహార్‌కు చెందిన మరో యువకుడు కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారీ కిందపడి దుర్మరణం పాలయ్యాడు.

కుప్పం యువకుడు బెంగళూరులో...

కుప్పం మండలం, క్రిష్ణదాసనపల్లి గ్రామానికి చెందిన లేట్ సోమశేఖర్ కుమారుడు కె. ఎస్. భువనచంద్ర (27) బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం మేరకు.. తల్లిదండ్రులు లేని భువన చంద్ర బెంగళూరు పట్టణంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. నిత్యం బెంగళూరుకు ఉదయం వెళ్లి, రాత్రి ఇంటికి వస్తుంటాడు. రోజులాగానే భువన చంద్ర గురువారం ఉదయం బయలుదేరి బెంగళూరు వెళ్లాడు. ఏమైందో తెలియదు గానీ బెంగళూరు నగరంలోని వైట్‌ఫీల్డ్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగళూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. గురువారం రాత్రి రైల్వే పోలీసులు భువన చంద్ర మృతదేహానికి పోస్టుమార్టమ్ చేసి బంధువులకు అప్పగించారు.

రైలు నుంచి జారీపడి బిహార్ యువకుడు...

సుమారు 27 ఏళ్ల వయస్సు ఉన్న బిహార్‌కు చెందిన యువకుడు బుధవారం అర్ధరాత్రి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు కుప్పం పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి బెంగళూరు – గౌహతి వెళ్లే రైలు నుంచి జారి పడి ఉండవచ్చని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. వైట్ టీషర్టు, బ్లాక్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. అతని వద్ద బెంగళూరు నుంచి కంచ్‌గంజ్ వెళ్లే రైల్వే టికెట్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు శవాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు కుప్పం రైల్వే పోలీసులు తెలిపారు.